ఎమ్మెల్సీ ఎన్నికలకు
137 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు
13వ తేదీ పోలింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి ఈనెల 13న జరగనున్న ఎన్నికలకు మొత్తం 137 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. అందులో 126 మెయిన్ పోలింగ్ స్టేషన్లు ఉండగా, 11 అదనపు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. మొత్తం 29,720 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 15,472, స్త్రీలు 14,246 మంది, ఇతరులు 2 ఓట్లు కలవు. 137 పోలింగ్ స్టేషన్లలో మహబూబ్‌నగర్ జిల్లాలో 15 పోలింగ్ స్టేషన్లు, నాగర్‌కర్నూల్‌లో 14, వనపర్తిలో 7, జోగులాంబ గద్వాల్‌లో 11, నారాయణపేట్‌లో 5, రంగారెడ్డి జిల్లాలో 31, వికారాబాద్‌లో 18, మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 14, హైదరాబాద్ జిల్లాలో 22 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 13వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
రుద్రాంగిలో 39.5 డిగ్రీలు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. మార్చి ప్రథమార్థంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువవుతున్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లాలో శుక్రవారం అత్యధికంగా 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈసాల తక్కళ్లపల్లి(పెద్దపల్లి)లో 39.4, మనాల్(రాజన్నసిరిసిల్ల)లో 39.2, వెల్గటూరు(జగిత్యాల) 38.9, జూలూరుపాడు (భద్రాద్రి కొత్తగూడెం)38.7, గుళ్లకోట(జగిత్యాల) 38.6, ఎండపల్లి(జగిత్యాల) 38.6, మండోర(నిజామాబాద్)38.5, నాయుడుపేట(భద్రాద్రి కొత్తగూడెం) 38.4, రాఘవపేట(జగిత్యాల) 38.3 డిగ్రీల చొప్పున పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నెల 15 నుంచి నాలుగైదు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు భారీగా తగ్గే అవకాశం ఉందని, అక్కడక్కడా వర్షం కూడా పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

సావిత్రిబాయి పూలే ఆదర్శమూర్తి : ఎంసిపిఐ(యు)

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భారత సమాజానికి సావిత్రిబాయి పూలే ఆదర్శమూర్తి అని ఎంసిపిఐ(యు) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో శుక్రవారం సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనువాదన్ని పెంచిపోషిస్తున్న బ్రాహ్మణిజానికి, ఆచారాలకు వ్యతిరేకంగా జ్యోతిరావు పూలే తెచ్చిన సంఘ సంస్కరణల అమలులో సావిత్రిబాయి పూలే పాత్ర గొప్పదన్నారు. మహిళలందరికీ విద్య అందాలనీ, మానవ వికాసం జరగాలని ఆమె తపించారని కొనియాడారు. భారత సమాజం మార్పు కోసం నడుం బిగించిందన్నారు. ఆమె స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కుంభం సుకన్య పూల మాల వేశారు. కార్యక్రమంలో ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, వరికుప్పల వెంకన్న, వస్కుల మట్టయ్య, వి తుకారాం నాయక్, కన్నం వెంకన్న, పి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతాం : కూనంనేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో బిజెపియేతర పార్టీల ప్రభుత్వాలను కూలగొట్టే పనిలో మోడీ సర్కారు ఉందనీ, అందుకు సిబిఐ, ఇడి, నిఘా, న్యాయ వ్యవస్థలను పావులుగా వాడుకుంటున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు దేశవ్యాప్తంగా గల్లీగల్లీ తిరుగుతూ బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. హైదరాబాద్‌లోని మగ్దూంభవన్‌లో మందా పవన్ అధ్యక్షతన సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కూనంనేని మీడియాతో మాట్లాడారు. మనీ ల్యాండరింగ్, ఇతర కేసుల్లో 51 మంది బిజెపి ఎంపీలపైనా, 78 మంది ఎమ్మెల్యేలపైనా ఫిర్యాదులు అందితే ఎందుకు విచారణ చేపట్టలేదని ప్రశ్నించారు. అదానీ, విజయ్‌మాల్యా, లలిత్‌మోడీల కుంభకోణాల్లో వారిని ఎందుకు అరెస్టు చేయడం లేదని నిలదీశారు. యుపిలో ప్రశ్నించే దళితులు, మైనార్టీలపై యోగీ తన ప్రతాపం చూపుతున్నారని విమర్శించారు. మోడీ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. జిఒ 58, 59 కింద 2020 వరకు గుడిసెలు వేసుకుని ఉంటున్నవారికే రెగ్యులరైజేషన్‌కు అవకాశం కల్పించడం సరిగాదన్నారు. ఇప్పటి వరకు గుడిసెలు వేసుకుని ఉంటున్న ప్రతిఒక్కరికీ అవకాశమివ్వాలనీ, గృహలక్ష్మి కింద వారికి రూ.3 లక్షలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీలు ఏకమైతే ఎన్నికలలో గెలవలేమని కేంద్ర ఏజెన్సీలను మోడీ ప్రయోగిస్తున్నారని విమర్శించారు. అదానీ వ్యవహారంపై జెపిసి ఎందుకు వేయడంలేదని ప్రశ్నించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మోడీ హయాంలో ధరలు విపరీతంగా పెంచేస్తున్నారనీ, ఇటీవల గ్యాస్, పెట్రోలు ధరలు పెద్ద ఎత్తున పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏప్రిల్ 14న అంబేద్కర్ విగ్రహం ప్రారంభం

30న సచివాలయ ప్రారంభోత్సవం ● జూన్ 1న అమరవీరుల జ్యోతి జాతికి అంకితం
ఏప్రిల్ 27న ఎల్‌బి స్టేడియంలో బిఆర్‌ఎస్ ప్రతినిధుల సభ : సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హుస్సేన్‌సాగర తీరంలో ప్రభుత్వం నిర్మిస్తోన్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, స్మృతివనాన్ని అంబేద్కర్ జయంతి రోజు ఏప్రిల్ 14న ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించారు. ఆరోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి దళిత సోదరులను హైదరాబాద్‌కు ఆహ్వానించి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు పూర్తై తుది మెరుగులు దిద్దుకుంటున్న బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయాన్ని ఏప్రిల్ 30న ప్రారంభించనున్నారు. తెలంగాణ అమరవీరుల స్మారక కేంద్రంగా నిర్మిస్తున్న అమరుల జ్యోతిని జూన్1న జాతికి అంకితం చేయనున్నారు.

శుక్రవారం మంత్రులు, అధికారులతో కలిసి సచివాలయం, అమరుల జ్యోతి, అంబేద్కర్ విగ్రహం పనులను సిఎం కెసిఆర్ పరిశీలించారు. తొలుత సచివాలయానికి చేరుకున్న సిఎం.. ఎలివేషన్ పనులను, ఫౌంటేన్, గ్రీన్ లాన్, టూంబ్ నిర్మాణం, దానికి తుది దశలో అమరుస్తున్న స్టోన్ డిజైన్ వర్కు తదితర పనుల పురోగతిని పరిశీలించారు. సెక్రటేరియట్ ప్రధాన ద్వారం అత్యంత విశాలంగా నిర్మించిన తీరును, భోపాల్ నుంచి ప్రత్యేకంగా వుడ్ కార్వింగ్ చేసి తెప్పించి అమర్చిన ద్వారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరవ అంతస్తులోని సిఎం చాంబర్‌లో ఏర్పాటు చేసిన టేబుళ్లు, కుర్చీలు, ఫర్నీచర్‌ను పరిశీలించారు. సిఎం కెసిఆర్ చేసిన సూచనల మేరకు వాల్ క్లాడింగ్, డెకరేషన్ తదితర తుదిమెరుగులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మార్బుల్ ఫ్లోరింగ్, విశాలమైన కారిడార్లు, చాంబర్ల ద్వారాలను తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని, అధికారులను, వర్క్ ఏజెన్సీ ఇంజనీర్లను సిఎం అభినందించారు. సిఎం చాంబర్‌లోని సమావేశ మందిరాన్ని పరిశీలించారు. సిఎంఒ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన చాంబర్లను, ఫర్నీచర్‌ను తిలకించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చాంబర్‌ను, వారి సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన కార్యాలయాలను, కాన్ఫరెన్స్ హాల్‌ను, సందర్శకుల కోసం వేచివుండే గదులను అందులోని సౌకర్యాలను సిఎం పరిశీలించారు. సమావేశాలు సహా, డైనింగ్ తదితర అవసరాల కోసం మల్టిపుల్‌గా ఉపయోగించుకోవడానికి ఏర్పాటు చేసిన విశాలవంతమైన హాల్‌ను సిఎం పరిశీలించారు. జీఎడి ప్రోటోకాల్ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన చాంబర్లను, కలెక్టర్ల కాన్ఫరెన్స్ హాల్, ప్రజాప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన వెయిటింగ్ లాంజ్, విఐపిల వెయిటింగ్ లాంజ్‌లను సిఎం పరిశీలించారు. గ్రౌండు ఫ్లోర్‌లో ఉన్న పార్కింగ్ తదితర పనులను పరిశీలించి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి, వర్క్ ఏజెన్సీలకు, ఇంజనీర్లకు సిఎం కొన్ని సూచనలు చేశారు. అక్కడి నుంచి తెలంగాణ అమర వీరుల స్మారకార్థం నిర్మిస్తున్న అమరవీరుల జ్యోతి నిర్మాణ పనుల పురోగతిని సిఎం పరిశీలించారు. మొదటి అంతస్తులో ఆడియో, వీడియో ప్రదర్శనల కోసం నిర్మిస్తున్న ఆడిటోరియంలో లేజర్ షో, ర్యాంప్, సెల్లార్ పార్కింగ్ పనులను పరిశీలించారు. నిర్మాణ పురోగతిని ఇంజనీర్లు మ్యాపుల ద్వారా కెసిఆర్‌కు ఇంజినీర్లు వివరించారు. సిఎం కెసిఆర్ వెంట మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, ఎ.జీవన్ రెడ్డి, సిఎస్ శాంతి కుమారి, అధికారులు శ్రీనివాస్ రాజు, గణపతి రెడ్డి, ప్రభుత్వ నిర్మాణ సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ, ఎస్సి కార్పోరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ తదితరులు ఉన్నారు.

మోడీ బినామీ అదానీ

- లక్షల కోట్లను లూటీ చేసిన అదానీని ఎందుకు అరెస్టు చేయరు
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మోడీ బినామీ అదానీ అని, లక్షల కోట్ల దేశ సంపదను లూటీ చేసిన అదానీని ఎందుకు అరెస్టు చేయరని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మోడీకి బినామీ అదానీ అని విమర్శించారు. దేశ ప్రజల సొత్తును అప్పనంగా అదానీకి కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థనే ఛిన్నాభిన్నం చేసిన అదానీపై ప్రధాని మోడీ ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ఇడి, సిబిఐ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు, చివరికి న్యాయ వ్యవస్థలు సైతం ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయని అన్నారు. రూ.లక్షల కోట్ల ప్రజాధానాన్ని లూటీ చేసిన అదాని కేంద్రానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కర్ణాటకలోని బిజెపి ఎమ్మెల్యే ఇంట్లో నోట్ల కట్టలు బయట పడ్డాయన్నారు. అతడిని అరెస్టు చేయకముందే ముందస్తు బెయిల్ తీసుకోవడం వెనుక బిజెపి హస్తం ఉందని విమర్శించారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో దోషి అయిన సంతోష్‌కు కూడా కోర్టు బెయిల్ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి నేతలు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశానికి నష్టం కలిగించేవిధంగా చేస్తున్నారని విమర్శించారు. గాంధీని చంపిన గాడ్సేకు గుడులు కట్టించే పాలకుల ఏలుబడిలో మనం ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటులో గాంధీ పక్కన మతవాది సావర్కర్ ఫొటోను పెట్టాలనుకోవడం దారుణమన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక దేశంలో కుబేరుల సంఖ్య పెరుగుతుండగా.. పేదలు మరింత పేదలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగ ప్రజాస్వామ్య, లౌకికతత్వం, సామాజిక న్యాయాన్ని కాపాడుకోవడం కోసం.. ఈ నెల 17 నుంచి 28వ తేదీ వరకు జన చైతన్య యాత్ర నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ జాతాలకు ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాల వారు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, కార్మికులు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఎ.రాములు, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, గద్వాల జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, నారాయణపేట జిల్లా కార్యదర్శి వెంకట్‌రామ్‌రెడి, రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ , కడియాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో కనీస వేతనాలు అమలు చేయాలి

- సిఐటియు గౌరవాధ్యక్షులు వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాధర్నాలో మాట్లాడుతున్న వెంకటేష్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలో నాన్ టీచింగ్, డైలీ వేజ్, ఎన్.ఎం.ఆర్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ తదితర ఉద్యోగులకు జిఒ 63 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె వెంకటేష్ డిమాండ్ చేశారు. ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో వెంకటేష్, రాష్ట్ర అధ్యక్షులు మెట్ట రవి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 18 యూనివర్సిటీలలో సుమారు పది వేల మంది సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. వీరిలో టైం స్కేల్, డైలీ వేజ్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ తదితర పద్ధతుల్లో నియామకాలు జరుగుతున్నాయన్నారు అయితే, రాష్ట్రంలో ఏ యూనివర్సిటీలోనూ ఈ సిబ్బందికి జాబ్ చార్ట్ లేదని, వేతనాల్లో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయని తెలిపారు. ఒక్కో యూనివర్సిటీకి ఒక్కో వేతన నిర్ణయం అమలు చేయడం అన్యాయమన్నారు. యూనివర్సిటీల్లో నిర్ణయించిన కనీస వేతనాలు అతి తక్కువ ఉండగా, అందులోను ఏజెన్సీలు కార్మికుల వేతనాల్లో ఎక్కువ కోతలు విధిస్తున్నాయని చెప్పారు. పది గంటల పని విధానం అమలులో ఉండటం వల్ల పని భారం పెరుగుతుందన్నారు. అధికారుల వేధింపులు, మహిళా ఉద్యోగుల పట్ల వివక్ష కొనసాగుతోందని తెలిపారు. యూనివర్సిటీలో తప్పనిసరిగా జీవో 63 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదేళ్ల సర్వీస్ దాటిన వారిని టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కాంట్రాక్టర్ మారితే సిబ్బందిని తొలగించే అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్ మానుకోవాలని సూచించారు. రిటైర్ అయిన సిబ్బందికి రూ.ఐదు లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేసి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. బస్సు పాస్ సౌకర్యం కల్పించి మహిళా ఉద్యోగులకు ఆరు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రాష్ట్ర సహాయ కార్యదర్శి టి మహేందర్, సమ్మయ్య, ఎస్కే ఆవుర్, చిరంజీవి మహమ్మద్ సల్లర్ తదితరులు పాల్గొన్నారు.

మాణిక్‌రెడ్డికే మా మద్దతు
తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిఎస్‌యుటిఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నట్టు తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జెఎసి కన్వీనర్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో కాంట్రాక్ట్ అధ్యాపకుల పోరాటాలకు టిఎస్‌యుటిఎఫ్ మద్దతుగా నిలిచిందని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కూడా తమ సమస్యలపై పోరాడుతున్నారని తెలిపారు. తమ పోరాటాలకు మద్దతుగా నిలుస్తున్న, సమస్యల పరిష్కారం కోసం కొట్లాడుతున్న టిఎస్‌యుటిఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు.

సర్వికల్ కేన్సర్ ప్రమాద ఘంటికలు
కార్కినోస్ వెల్లడి

హైదరాబాద్ :దేశంలో సర్వికల్ కేన్సర్ ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని ఆంకాలజీ టెక్నలాజీ వేదిక కార్కినోస్ హెల్త్‌కేర్ పేర్కొంది. ప్రతీ ఎనిమిది నిమిషాలకు ఓ మహిళ సర్వికల్ కేన్సర్ బారినపడుతున్నారని పలు నివేదికలు వెల్లడించాయని గుర్తు చేసింది. మూడు రోజులపాటు సాగిన బిజినెస్ ఉమెన్ ఎక్స్‌పో-2023లో కార్కినోస్ హెల్త్‌కేర్ కో ఫౌండర్ సుప్రియరావ్ మాట్లాడుతూ.. మాతృమూర్తులతోపాటుగా కుమార్తెలను ఈ కేన్సర్ బారినపడకుండా కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను కార్కినోస్ నొక్కి చెప్పారు. అంతర్జాతీయంగా సర్వికల్ కేన్సర్ కేసుల మరణాల్లో నాలుగో వంతు భారత్‌లోనే చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రతీ ఏడాది ఆరు లక్షల కొత్త కేసులు నమోదు కాగా.. 3,41,831 మరణాలు సంభవిస్తున్నాయన్నారు. వ్యాధి తీవ్రతను ముందుగానే గుర్తించడం ద్వారా కుటుంబంపై ఆర్థిక భారం పడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఉపాధి హామీ పని దినాలు పెంచాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీలో సంవత్సరానికి 200 పనిదినాలు కల్పించి, ప్రతి రోజూ రూ.600 వేతనం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఉర్దూఘర్‌లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించడంలో హామీలే తప్ప కార్యాచరణ ఏమి చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ అమలు చేయకపోవడంతో మహిళలు సమాన అవకాశాలు పొందలేకపోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 33 శాతం మహిళ రిజర్వేషన్ అమలు చేస్తే 180 మంది మహిళలకు చట్ట సభల్లో అవకాశం వస్తుందని తెలిపారు. అలాగే 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేస్తున్న దీక్షకు ఐద్వా ఆధ్వర్యంలో మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. బిజెపి ప్రభుత్వ పాలనలో నిత్యావసర ధరలు పెరగడమే కాకుండా ప్రజలు ఆర్థిక భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మహిళలు పౌష్టికాహారం కరువై రక్తహీనతతో బాధపడుతున్నారని, కాబట్టి ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని తొలగించి దాని స్థానంలో దేశ వ్యాప్తంగా మనుస్మృతిని అమలు చేసేందుకు బిజెపి కుట్రలు చేస్తోందని విమర్శించారు. మనుస్మృతి అమలైతే మహిళలకు హక్కులు లేకుండా పోతాయని అన్నారు. బిజెపి ప్రభుత్వ హయాంలో మహిళలకు భద్రత కొరవడిందని, భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా పోయిందని తెలిపారు. రాష్ట్రంలో ఇండ్లు లేక గుడిసెలలో ఉన్న వారికి పట్టాలిచ్చి ఇండ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో పారిశ్రామిక కేంద్రం ఏర్పాటు చేస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెతో పాటు ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సబ్బని లత, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్‌ను నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధరప్పా, రైతు సంఘం జిల్లా నాయకులు గంగామణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు గంగాధర్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు జంగం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక తెలంగాణ కోసం ఐక్య ఉద్యమం

- తెలంగాణ బచావో సదస్సు తీర్మానం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామిక తెలంగాణ కోసం ఉమ్మడిగా ఉద్యమించాలని తెలంగాణ బచావో సదస్సు తీర్మానించింది. హైదరాబాద్‌లో తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్ జరిగి 12 సంవత్సరాలైన సందర్భంగా శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కన్నెగంటి రవి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 'త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ సంక్షోభాల చౌరస్తాలో భవిష్యత్తు అగమ్యగోచరంగా మారి చూస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. ఉద్యమ పార్టీగా అవతరించి బిఆర్‌ఎస్‌గా మారిన టిఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ఉద్యమ ఆకాంక్షల స్ఫూర్తిని దెబ్బతీసిందని విమర్శించింది. రాష్ట్రం దివాళా తీసింది. లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నా...వాటిని భర్తీ చేయలేదు. ధరణి పోర్టల్‌తో సమస్యలను మరింత పెంచింది. దళిత బంధు పూర్తిస్థాయిలో అమలయ్యే పరిస్థితి లేదు. సమగ్ర వ్యవసాయ విధానం, శాస్త్రీయ పంటల ప్రణాళికా రూపొందించలేదు. విద్యారంగాన్ని ధ్వంసం చేసింది. వైద్యరంగం ప్రయివేటుపరమైంది. తీవ్రమైన ఆర్థిక దోపిడీకి సాగునీటి ప్రాజెక్టుల రీ డిజైన్ కేంద్రాలుగా మారాయి. పేదల కోసమంటూ నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు పైరవీలతో కొందరు దక్కించుకుంటున్నారు. రాష్ట్రంలో ఏకస్వామ్య, నిరంకుశ పాలన అమల్లో ఉంది. కేంద్రంలో బిజెపి రాష్ట్ర ప్రజల హక్కులను కాలరాస్తున్నది. వాటి సాధనలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేయడం లేదు...' అని సదస్సు తీర్మానించింది. ఈ నేపథ్యంలో ప్రజల ఆకాంక్షలే ఎజెండాగా ఐక్య ఉద్యమాల నిర్మాణం జరగాలనీ, వాటి నిర్మాణ బాధ్యత రాష్ట్ర ప్రజలు, ఉద్యమ శక్తులపై ఉందని సదస్సు అభిప్రాయపడింది. ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి ఆటంకంగా ఉన్న రాష్ట్రంలోని అవినీతికర పాలన కూలిపోక తప్పదని స్పష్టం చేసింది. నిజమైన ప్రజాస్వామిక శక్తులు ప్రజలను ముందుకు నడిపించి, విజయం సాధించాలని పిలుపునిచ్చింది. సదస్సులో టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, వీక్షణం వేణుగోపాల్, ప్రజా గాయకులు గద్దర్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అద్దంకి దయాకర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు గోవర్ధన్, పిఒడబ్ల్యు నాయకురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకుకృషి

- జి రాములు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు కృషి చేయాల్సిన అవసరం నేటి సమాజంలో మరింత పెరిగిందని తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం (టిపిఎస్‌కె) కన్వీనర్ జి రాములు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనువాదం మెజారిటీ ప్రజలకు చదువులు నిషేధించిందని గుర్తుచేశారు. నాగరిక సమాజానికి అక్షర దివిటి అందించిన సామాజిక విప్లవ మాతృమూర్తి సావిత్రి భాయి పూలే అని చెప్పారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ నాడు సావిత్రిబాయి పూలే అస్పృశ్యత నివారణకు మహిళల చదువు పైన ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

ఆమె ఆశయాలకు తిలోదకాలిస్తూ నేటి కేంద్ర బిజెపి సర్కార్ నూతన విద్యా విధానం పేరుతో దళితులు పేదలకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండి అబ్బాస్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తన భర్త సహకారంతో దేశంలో మెజారిటీ ప్రజలకు అక్షర ఆయుధాన్ని అందించిన మొదటి వ్యక్తిగా నిలుస్తారన్నారు. మహిళా లోకానికి సావిత్రిబాయి పూలే ఒక స్ఫూర్తి శిఖరం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోదుగు పూలు పత్రిక ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రయివేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎ విజయ్ కుమార్, వివిధ ప్రజా సంఘాలనాయకులు కొమ్ము విజయ్ కుమార్ ,జగదీష్ బాలరాజు, జానయ్య, రవి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మనువాదాన్ని వ్యతిరేకిద్దాం

- ప్రొఫెసర్ కంచ ఐలయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రమ జీవుల పోరాటాలను, సంస్కృతిని, వేల సంవత్సరాలుగా దేశనిర్మాణం కోసం చేసిన మహత్తర ప్రక్రియను సర్వనాశనం చేస్తున్న మనువాదాన్ని ప్రతిఘటించాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్వేచ్ఛ జెఎసి అధ్వర్యంలో సావిత్రిబాయి యాదిలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని రక్షించుకుందాం, మతోన్మాదం, మనువాదాన్ని వ్యతిరేకిద్దాం అంటూ సాంస్కృతికోత్సవాలు ఆటపాట నిర్వహించారు. ఈ సందర్భంగా కంచ ఐలయ్య మాట్లాడుతూ.. విభిన్న సంస్కృతుల మధ్య జరుగుతున్న పోరాటలపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి పాటలు, నాటికలు, పాటలు రాయాలన్నారు. జెఎసి కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ.. మనువాదుల దాడులను ప్రతిఘటించడానికి, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాటానికి స్వేచ్ఛ జేఏసీ ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా కవి జయరాజ్, అరుణోదయ గాయకులు విమలక్క, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, కళాకారులు మస్తార్జి, పులి కల్పన, భాస్కర్, స్వేచ్ఛ జేఏసీ భాగస్వామ్య సంస్థల నాయకులు కొల జనార్ధన్, జిడి సారయ్య, సంధ్య, ఝాన్సీ, వరలక్ష్మి, పి.శంకర్ ప్రసంగించారు.

అసంఘటిత కార్మికుల సమస్యలపై సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ది సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో భారతదేశంలో అసంఘటిత కార్మికులు: సమస్యలు, సవాళ్లు అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఐసీఎస్ఎస్ఆర్-సౌత్ రీజియన్ సెంటర్ ఈ సమావేశానికి సహకరించాయి. సదస్సు కన్వీనర్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె రాణి రత్నప్రభ వ్యవహరించారు. "భారతదేశంలో అసంఘటిత కార్మికులు: సమస్యలు మరియు సవాళ్లు" అనే పుస్తకాన్ని యుపీ కార్మికశాఖ వివి గిరి లేబర్ ఇన్‌స్టిట్యూట్ డిజి అమిత్ నిర్మల్ విడుదల చేశారు.

బయ్యారంపై బిజెపి 'ఉక్కు'పాదం

- స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఆశలు లేనట్టే..!
- గుజరాత్ అదానీ ఫ్యాక్టరీకి బైలడిల్లా ఖనిజం
- కేంద్రం తీరుపై బిజెపేతర పక్షాల ఆగ్రహం
- విభజన హామీలను నిర్లక్ష్యం చేస్తున్న బిజెపి
- కేంద్రం తీరుకు నిరసనగా 17 నుంచి సిపిఎం 'ప్రజాగర్జన'



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన హామీలను కేంద్రం ఒక్కొక్కటిగా తుంగలో తొక్కుతోంది. దీనిలో బయ్యారంలోని ఉక్కు ఫ్యాక్టరీ ప్రధానమైంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 13వ షెడ్యూల్‌లో పార్లమెంట్ సాక్షిగా కేంద్రం ఇచ్చిన హామీని బిజెపి ప్రభుత్వం నీరుగారుస్తోంది. బయ్యారం ఇనుప ఖనిజం సరిపోదనుకుంటే బైలడిల్లా నుంచి దిగుమతి చేసుకుని సరఫరా చేస్తామని తెలంగాణ ప్రభుత్వం పలుమార్లు కేంద్రాన్ని కోరింది. అయినప్పటికీ గుజరాత్‌లో అదానీ గ్రూపు నిర్మిస్తున్న ఉక్కు ఫ్యాక్టరీకి బైలడిల్లా నుంచి ఇనుప ఖనిజాన్ని కేటాయించడంతో బయ్యారం ఇనుప పరిశ్రమపై ఆశలు అడుగంటాయి. ఇదే కాదు ఇంకా అనేక ప్రజావ్యతిరేక విధానాలను కేంద్రం అనుసరిస్తోంది. వీటిపై సిపిఎం ఈనెల 17 నుంచి 'ప్రజాగర్జన' యాత్రలకు శ్రీకారం చుట్టింది.

సట్టుబండైన చట్టబద్ధ హామీ..

పునర్విభజన చట్టంలో బయ్యారంలో ఉక్కు కర్మాగారం రూ.36 వేల కోట్లతో సెయిల్ ఆధ్వర్యంలో నిర్మిస్తామని చట్టబద్ధమైన హామీ ఇచ్చారు. తొమ్మిదేళ్లుగా దీనికోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు నిరీక్షిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల 20 వేల మందికి ఉపాధితో పాటు ఏజెన్సీ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని ప్రజాప్రతినిధులు నివేదించారు. దీంతో స్టీల్‌ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్రం చట్టబద్ధమైన హామీ ఇచ్చింది. కానీ దాన్ని ఆచరణలో పెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివక్ష చూపడమే కాకుండా ఆ హామీని పూర్తిగా తుంగలో తొక్కేందుకు పూనుకుంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రజాప్రతినిధులు పలుమార్లు ప్రధాని, ఉక్కుశాఖ మంత్రిని కలుస్తున్నారు. పార్లమెంట్ సమావేశాలు, ముఖ్యంగా బడ్జెట్ సమావేశాల్లో దీనిని ప్రస్తావిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో పలురకాల సర్వేలు నిర్వహించి బయ్యారం ఇనుప ఖనిజం నాణ్యత, ఖనిజ నిక్షేపాల లభ్యత చాలినంతగా లేదని సర్వే సంస్థలు తేల్చాయి. ప్లాంట్ లాభదాయకం కాదని ప్రకటించాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సైతం బయ్యారం ఉక్కుపై కొన్ని నెలల కిందట అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుకూలాంశాలపై రాష్ట్రప్రభుత్వం నివేదిక సైతం సమర్పించింది. కానీ ఇవేవీ కేంద్రం పట్టించుకోలేదు. పైగా ఇనుప గనులే లేని గుజరాత్‌కు బైలడిల్లా ఖనిజాన్ని కట్టబెట్టారు.

180 కి.మీ వదిలి.. 1800 కి.మీలకు కేటాయింపు..

బయ్యారం సమీపంలోని సింగరేణి నుంచి బొగ్గు, కెటిపిఎస్ నుంచి విద్యుత్, నీటి వనరులు, మాధారం డోలమైట్ గనులు, రైలుమార్గం అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి ఖనిజ నిక్షేపాలు సరిపోకపోతే 180 కి.మీ దూరంలోని బైలడిల్లా నుంచి ముడి ఇనుమును సొంత ఖర్చుతో దిగుమతి చేసుకుంటామని రాష్ట్రప్రభుత్వం సూచించింది. అయినా కేంద్రం పట్టించుకోకుండా 1800 కి.మీ దూరంలోని గుజరాత్ ముద్రా ప్లాంట్‌కు, 500 కి.మీ దూరంలోని విశాఖ ఉక్కు కర్మాగారానికి కేటాయించడంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

కేంద్రానికి తెలంగాణపై వివక్ష

కేంద్రం తెలంగాణపై వివక్ష పూరిత వైఖరితో ఉంది. దానికి బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీయే ప్రత్యక్ష నిదర్శనం. రాష్ట్రప్రభుత్వమే సొంత ఖర్చుతో రైలుమార్గం నిర్మించి బైలడిల్లా నుంచి ఇనుప ఖనిజం దిగమతి చేసి ఇస్తామని చెప్పినా కేంద్రం పట్టించుకోలేదు. ఏజెన్సీ ప్రజల బాగోగులు, గిరిజన అభివృద్ధి ఇవేవీ కేంద్రానికి పట్టడం లేదు.

- బానోత్ హరిప్రియ, ఎమ్మెల్యే ఇల్లందు

బయ్యారం ఉక్కుపై బిజెపిది ప్రతికూల వైఖరే..

బయ్యారం ఉక్కుపై మొదటి నుంచి బిజెపి ప్రతికూల వైఖరితోనే వ్యవహరిస్తోంది. ఇక్కడ ఇనుప ఖనిజం నాణ్యమైనది కాదనే కల్లబొల్లి కబుర్లు చెబుతోంది. ఇక్కడ ఖనిజం నాణ్యమైనది కానప్పుడు అనేక ప్రయివేటు కంపెనీలు ఎందుకు తరలించుకు వెళ్లాయని ప్రశ్నిస్తున్నా. ఇప్పటికే 200 కంపెనీలు ఇక్కడి ఇనుప ఖనిజం కోసం అప్లికేషన్లు పెట్టాయి. మాజీ సిఎంలు వైఎస్ రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి.. రక్షణ, విశాఖ స్టీల్స్‌కు ఇక్కడి ఖనిజాన్ని కేటాయించారు. నాణ్యత లేకుండా ఇవన్నీ ఎలా సాధ్యం.

- గౌని ఐలయ్య, బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన కమిటీ కన్వీనర్

కేంద్రానికి చిత్తశుద్ధి లేదు..

కేంద్ర ప్రభుత్వానికి బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై చిత్తశుద్ధి లేదు. అందుకే నాణ్యత ప్రమాణాలను కుంటిసాకుగా చూపుతోంది. ఇక్కడి ఖనిజం నాణ్యత 45 ప్లస్ అని నిపుణులు తేల్చినా కేంద్రం నాణ్యతాప్రమాణాలను సాకుగా చూపుతుండటంతో ఆశ్చర్యం గొల్పుతోంది. అదానీ, గుజరాత్ తప్ప కేంద్రానికి మిగిలిన ప్రాంతాలతో పనిలేదు. అందుకే వివక్షపూరితంగా వ్యవహరిస్తోంది. అందుకే కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం ప్రజాగర్జన యాత్ర 17 నుంచి చేపడుతుంది. ఈ యాత్రను విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి. మన హక్కులను మనం పొందాలి.

- అన్నవరపు కనకయ్య, సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి



మీ భూమి.. మీ హక్కు

- వచ్చే మా ప్రభుత్వంలో ధరణిని ఎత్తేస్తాం
- ఢిల్లీలో కవిత ధర్నాకు మా మద్దతు లేదు
- కాంగ్రెస్ జాతీయ నేత జైరాం రమేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'మీ భూమి.. మీ హక్కు' నినాదంతో త్వరలోనే కార్యక్రమాన్ని చేపడతామని, తెలంగాణలో తమ సర్కారు రాగానే ధరణి పోర్టల్‌ను ఎత్తేస్తామని ఆ పార్టీ జాతీయ నేత జైరాంరమేష్ తెలిపారు. ఢిల్లీలో కవిత చేపట్టిన ధర్నాకు తమ పార్టీ మద్దతు లేదని, కనీసం పాలుపంచుకోదని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తానాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ధరణి అదాలత్ కార్యక్రమానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ధరణిలో దాదాపు 20 లక్షల ఖాతాల్లో సమస్యలున్నాయని, ఎవరి భూములపై వారికే హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని చెప్పారు. తెలంగాణలో 15 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారికి సర్కారు నుంచి ఎలాంటి సాయమూ అందడం లేదని తెలిపారు. ప్రస్తుతం భూములకు సంబంధించి 125 చట్టాలు.. 30 వేల జిఒలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే వాటన్నింటినీ క్రోడీకరించి ఒకే చట్టం తీసుకొస్తామన్నారు. యజమాని అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ భూమి తీసుకునే హక్కు ప్రభుత్వానికి లేకుండా 2013లోనే కాంగ్రెస్ సర్కారు చట్టం తీసుకొచ్చిందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. బలవంతపు భూసేకరణను నిషేధిస్తామని, ఆ చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తామని అన్నారు. సమావేశంలో పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాణిక్ రావ్ ఠాక్రే, ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, ఎఐసిసి జాతీయ నాయకులు కొప్పుల రాజు, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

రవన్న వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎన్ వేణుగోపాల్

ఏకీభవించనోడి పీక నొక్కడమే ఫాసిజం

- ఐక్యఉద్యమాలతో బిజెపిని ఓడిద్దాం
- ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఏకీభవించనోడి పీకనొక్కడమే ఫాసిజం సహజలక్షణమని ప్రొఫెసర్ హరగోపాల్ చెప్పారు. సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) ఏడో వర్ధంతి సభను నిర్వహించారు. కె రమ అధ్యక్షతన జరిగిన సభలో హరగోపాల్ మాట్లాడుతూ సామాజిక పునాదిలో పురుషాధిపత్యం, కులం, మతం ఆవహించి ఉన్నాయని చెప్పారు.దీంతో మహిళలపై హింస, అణచివేత పెరిగిపోయిందన్నారు. స్త్రీని రెండో తరగతి పౌరురాలుగా చూస్తున్నారని చెప్పారు. క్రింది కులాలపై ఆధిపత్యం కొనసాగుతోందన్నారు. తద్వారా దాడులు జరుగుతున్నాయని తెలిపారు. మధ్యస్థ కులాలు కిందివైపు వస్తే.. మార్పు వస్తుందని, పై కులాల వైపు పోతే ఫాసిజం వస్తుందని చెప్పారు. 1992లో రథయాత్ర చేసి, మతకొట్లాటలు సృష్టించి వేలాదిమంది చావుకు కారణమయ్యారని చెప్పారు.'భారత దేశంలో ఫాసిజం-ఆర్థిక రాజకీయ కారణాలు' అనే అంశంపై వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్, 'ఫాసిజం-దళితుల, మైనార్టీలపై దాడులు' అంశంపై ప్రముఖ రచయిత సతీష్‌చందర్, 'ఫాసిజం-మహిళలు'అంశంపై సామాజిక విశ్లేషకులు దేవి, ఫాసిస్టు వ్యతిరేక పోరాటాల అవశ్యకతపై పోటు రంగారావు ప్రసంగించారు. భారత రాజ్యాంగంలో ఆమోదించిన కొద్దిపాటి హక్కులూ ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం,పేదరికం, అసమానతలతోపాటు సకలరంగాల్లో సంక్షోభాలు ఎదురవుతున్నాయని చెప్పారు. మరో పక్క మత ఉన్మాదం, విద్వేషం కట్టలు తెంచుకుని ప్రజలమీద స్వైర విహారం చేస్తోందని చెప్పారు. తిండిమీద, కట్టుబాట్లమీద, విశ్వాసాలమీద, స్వేచ్ఛాహక్కులమీద ఆంక్షలు విధిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్నే ధ్వంసం చేసి మనువాదరాజ్యాంగ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. దేశభక్తియుత శక్తులతో ప్రజాస్వామిక వాదులతో ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాలు నిర్వహించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెజి రామచందర్, కె రంగయ్య, జి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఎం హన్మేష్, ఎస్ఎల్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అవసరాలకు 'అత్యుత్తమ' శిక్షణ

- ఆధునిక టెక్నాలజీని వాడుతున్నాం : సిఐఎస్ఎఫ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలోని పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామని సిఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు తెలిపారు. భద్రత, రక్షణ కల్పించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నామని వ్యాఖ్యానించారు. చిన్న సంఘటన జరిగినా తీవ్రంగానే పరిగణిస్తామనీ, విచారణ చేయడం ద్వారా సమస్యలను వేగంగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) 54వ రైజింగ్ పరేడ్ నేపథ్యంలో శనివారం హకీంపేటలోని జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీ (ఎన్ఐఎస్ఎ)లో సిఐఎస్ఎఫ్ అదనపు డైరెక్టర్ (నార్త్) జనరల్ పీయూష్ ఆనంద్, అదనపు డైరెక్టర్ జనరల్ (ఎయిర్‌పోర్ట్స్ అపరేషన్స్) జ్ఞానేందర్ సింగ్ మాలిక్, అదనపు డైరెక్టర్ జనరల్ (సౌత్) జగ్బీర్‌సింగ్, ఎన్ఐఎస్ఎ డైరెక్టర్ సునిల్ ఇమ్మాన్యుయేల్, డిఐజి అనిల్‌పాండే సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైజింగ్ డే పరేడ్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) బయట చేపట్టడం ఇదే తొలిసారని చెప్పారు. 1969లో శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. 54వ రైజింగ్ డే పరేడ్‌కు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరవుతారని వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలు బలగాలను దగ్గిర నుంచి చూడాలనే ఉద్దేశంతో న్యూఢిల్లీ వెలుపలికి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. సిఐఎస్ఎఫ్‌కి ఎన్ఐఎస్ఎ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కాబట్టి రైజింగ్ డే పరేడ్ ఇక్కడే నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. కవాతు సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది అద్భుతమైన ప్రదర్శనలతోపాటు ప్రతిభావంతమైన సేవకుగాను ఒక గ్యాలంటరీ, 22 రాష్ట్రపతి పోలీసు పతకాలు, విశిష్ట సేవలకు రాష్ట్రపతి పోలీసు పతకం సహా 23 పతకాలు అందజేయబడతాయని తెలిపారు. ప్రస్తుతం 66 విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, న్యూక్లియర్, స్పేస్ ఇన్‌స్టాలేషన్‌న్లు, ఢిల్లీ మెట్రో, స్టీల్, పవర్ ప్లాంట్లు సహా దేశంలోని 354 కీలకమైన పారిశ్రామిక సంస్థలకు సిఐఎస్ఎఫ్ భద్రత కల్పిస్తున్నదని చెప్పారు. తమ సంస్థ 1.70 లక్షల మంది సిబ్బందిని కలిగి ఉందని చెప్పారు. ఇన్ఫోసిస్ టెక్నాలజీస్‌కు చెందిన బెంగళూరు, పూణే, ఎలక్ట్రానిక్ సిటీ, బెంగళూరు యూనిట్లకు, ఒడిశాలోని టాటా స్టీల్ కళింగనగర్ సహా 11 ప్రైవేట్ సంస్థలకు భద్రతను విస్తరిస్తున్నామని వివరించారు. సిఐఎస్‌లో మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతున్నదని చెప్పారు. మొత్తం సిబ్బందిలో 6.7 శాతం మహిళలు ఉన్నట్టు చెప్పారు. విమానంలో ఏదైనా ఘటన జరిగితే ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం ప్రకారం బాధ్యులైన వారిని గుర్తించి స్థానిక పోలీసులు అప్పగించి కేసు నమోదయ్యేలా చూస్తామని చెప్పారు. అంతర్గత అవినీతి, అక్రమాలను నిరోధించేందుకు పటిష్టమైన విజిలెన్స్ అందుబాటులో ఉందని చెప్పారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నామని వివరించారు. శిక్షణ అభ్యర్థులకు చట్టం గురించి తెలుసుకునేందుకు ఎప్పటికప్పుడు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. టెక్నికల్ కోర్సులను అందుబాటులో ఉన్నాయని వివరించారు.

భూ సమస్యలెదుర్కొంటున్న 9 లక్షల మంది

- బరాబర్ ధరణిని రద్దు చేస్తాం
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో పరిష్కరిస్తాం
- ఇడి, సిబిఐ బిజెపి జేబు సంస్థలు
- టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ధరణితో తొమ్మిది లక్షల మంది సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ఆ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. అంతేకాదు.. ధరణి పోర్టల్‌ను బరాబర్ రద్దు చేస్తాం.. ధరణితో వేలాది ఎకరాల అసైన్డ్, పట్టా భూములు కెసిఆర్ బంధువుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఆ భూములు తిరిగి పేదలకు పంచి వారి ఆత్మగౌరవాన్ని నిలబెడుతాం. ఇడి, సిబిఐ బిజెపి జేబు సంస్థలుగా మారాయి.. బండి సంజయ్, కిషన్ రెడ్డి పేపర్ పులుల్లా టీవీల ముందు రంకెలేయొద్దు" అని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. యాత్ర ఫర్ ఛేంజ్ పేరుతో కాంగ్రెస్ చేపట్టిన పాదయాత్ర 24వ రోజు పెద్దపల్లి జిల్లా నుంచి జగిత్యాల జిల్లావరకు సాగింది. మధ్యలో ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌లో ధరణి అదాలత్ పేరుతో నిర్వహించిన సభలో రైతులతో వారి భూసమస్యలపై మాట్లాడించారు. అనంతరం అక్కడి నుంచి జగిత్యాల జిల్లాకు పయనమై కొత్తబస్టాండ్ చౌరస్తాలో స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఆయా చోట్ల రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ పోరాటాలకు మూలం భూమి అని, పేదవాడి ఆత్మగౌరవం, జీవన విధానం కూడా అని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో భూములను సేకరించి 22 లక్షల ఎకరాలను పేదలకు పంచామని చెప్పారు. 2006లో అటవీ హక్కుల చట్టం తెచ్చి ఆదివాసీ, గిరిజనులకు పది లక్షల ఎకరాలు పంపిణీ చేసిందని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం తెచ్చి పేదలను ఆదుకుంది కాంగ్రెస్ పార్టీయేనని చెప్పుకొచ్చారు. తమ జాతీయ నాయకులు జైరాంరమేష్ రూపకల్పన చేసిన ఆ చట్టాలకు కెసిఆర్, మోడీ కలిసి తూట్లు పొడిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ప్రతి గ్రామంలోనూ 20 సమస్యలు ఉంటే.. కెసిఆర్ తెచ్చిన ధరణితో 200 సమస్యలు ఉత్పన్నమయ్యాయని అన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ ధరణి విధానంలో లోపాలను సరి చేసి పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే మాట్లాడుతూ.. 'మీ భూ హక్కులకు మీకు తిరిగి కల్పించేందుకు కాంగ్రెస్ ఈ కార్యక్రమం చేపట్టింది' అన్నారు. పేదల భూములు వారికే చెందేలా చేసే వరకు 'ధరణి అదాలత్' కొనసాగిస్తామని చెప్పారు. సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉత్పత్తి రంగం కొద్ది మంది చేతుల్లో ఉంటే.. మిగతా ప్రజలు వారిపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. గతంలో భూమి ఒక్కటే ఉత్పత్తి రంగంగా ఉన్నప్పుడు.. దేశంలోని పేదలకు భూమిని పంచిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. అనంతరం ధరణి లోక్‌అదాలత్‌లో భాగంగా ప్రజల నుంచి వినతులు తీసుకుని వారికి 'కాంగ్రెస్ హామీ పత్రాలు' అందించారు. యాత్రలో కాంగ్రెస్ జాతీయ నాయకులు కొప్పుల రాజు, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. నర్సింగాపూర్‌లో ఆత్మహత్య చేసుకున్న రైతు జలపతి రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.లక్ష ఆర్థికసాయం చేశారు.

లిక్కర్ స్కాంలో ఇడి వివరణ ఇవ్వలే..

యాత్ర ఫర్ ఛేంజ్‌లో మీడియాతో రేవంత్ వ్యాఖ్య

లిక్కర్ స్కాం కేసులో ఏం జరుగుతుందో ఇడి అధికారులు ఇప్పటి వరకు వివరణ ఇవ్వలేదని, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా పట్ల వ్యవహరించనట్టు.. లిక్కర్ కేసులో కవిత పట్ల ఎందుకు వ్యవహరించడం లేదని పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇడి, సిబిఐ రెండూ బిజెపి జేబు సంస్థలని వ్యాఖ్యానించారు. అవినీతి ఆరోపణలు వచ్చిన రాజయ్యను బర్తరఫ్ చేసిన కెసిఆర్... ఇన్ని ఆరోపణలు ఎదుర్కొంటున్న కవితపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కెసిఆర్ అవినీతిపై తాను ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎందుకు విచారణ చేపట్టలేదన్నారు. కెసిఆర్ అవినీతికి పాల్పడ్డారని ప్రధాని, కేంద్ర మంత్రులు చెప్పారని, అయినా ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ గురవిందగింజ చందంగా ఉన్నారని విమర్శించారు.

తెలుగు భాషకు పట్టం కట్టిన కృష్ణదేవరాయలు

- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి

ప్రజాశక్తి కల్చరల్

తెలుగు భాషాభిమానిగా దేశ భాషలందు తెలుగు లెస్సగా పేర్కొని శ్రీకృష్ణదేవరాయలు ఆ భాషకు పట్టం కట్టారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ నివాళులర్పించారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా శ్రీకృష్ణదేవరాయలు సంస్మరణ శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా దామోదర్ పాల్గొని మాట్లాడుతూ భాష దేశ సంస్కృతిని ఉన్నత స్థితిలో నిలిపిన కవులు, సాహితీవేత్తలు వివిధ రంగాల ప్రముఖుల జయంతులతోపాటు గత శతాబ్దిలో జాతి ఖ్యాతిని నిలిపిన వారిని స్మరించుకోవడం ఉత్తమ సంస్కరమని అన్నారు. నేటి తరం వారికి ఈ మహనీయుల చరిత్ర విస్మరించకుండా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని అన్నారు. జర్నలిస్ట్ హాస్య అవధాని శంకర నారాయణ మాట్లాడుతూ కృష్ణ దేవరాయలు కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాలను పాలించినా ఆయనకు తెలుగుపై మక్కువ అని తెలిపారు. ఆయన ఆస్థానంలో అష్ట దిగ్గజాలు తెలుగులో కావ్య రచనకు ప్రోత్సాహకాలు ఇచ్చారని ఆయనే స్వయంగా ఆముక్తమాల్యద కావ్య రచన చేసిన సాహితీ వల్లభుడని పేర్కొన్నారు. గాన సభ అధ్యక్షులు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎందరో మహానుభావులు జయంతులకు విశేష ఆదరణ లభిస్తోందని, ఆలాగే శతాబ్ది పూర్వ మహనీయులు కు ప్రోత్సాహం వుంటుందన్నారు. వేదిక పై బండి శ్రీనివాస్, చంద్రశేఖర్,కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సాన్ మొబిల్ నుంచి కొత్త చమురు

హైదరాబాద్ : ఎక్సాన్‌మొబిల్ కొత్తగా పూర్తి సింథటిక్ ఇంజిన్ ఆయిల్ అయినా మొబిల్ 1 ట్రిపుల్ యాక్షన్ పవర్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఇది ఇంధన పొదుపు అదనపు ప్రయోజనంతోపాటు అద్భుతమైన ఇంజిన్ పనితీరు, రక్షణ, పరిశుభ్రతను అందిస్తుందని ఆ కంపెనీ పేర్కొంది. కారు యాజమానులకు వారి వాహనాల్లో శక్తిని అన్‌లాక్ చేయడంలో సాయపడేందుకు ప్రత్యేకంగా రూపొందించబడిందని తెలిపింది. మొబిల్ 1 ఇంజిన్ ఆయిల్స్‌ను ప్రపంచంలో అత్యంత కఠినమైన, అత్యంత తీవ్రమైన ట్రాక్‌ల్లో పరీక్షించామని ఎక్సాన్ మొబైల్ లూబ్రికెంట్స్ సిఇఒ విపిన్ రాణా పేర్కొన్నారు.

మహిళలకు బిఆర్ఎస్‌లో 33 శాతం పదవులెందుకివ్వలేదు? : బండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పార్టీలో మహిళలకు 33 శాతం పదవులెందుకు ఇవ్వడంలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మహిళా గోస- బిజెపి దీక్ష పేరుతో ఒక్కరోజు దీక్షను మహిళా మోర్చా నిర్వహించింది. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ..రాష్ట్రంలో మహిళలు, యువతులపై దాడులు జరిగితే కనీసం మాట్లాడని కవిత ఢిల్లీలో మహిళా బిల్లు కోసం దీక్ష చేయడం విడ్డూరంగా ఉందన్నారు. లిక్కర్ దందాను పక్కదోవ పట్టించేందుకే ఈ డ్రామాలని విమర్శించారు. గురువారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్‌లో మహిళా బిల్లు, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడుల అంశంపై ఎందుకు చర్చించలేదని నిలదీశారు. కెసిఆర్ క్యాబినెట్‌లో 33 శాతం పదవులు మహిళలకిచ్చే దమ్ముందా? అని సవాల్ విసిరారు. లిక్కర్ దందాపై టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మహిళా బిల్లుపై బిజెపి చిత్తశుద్ధిని శంకించే అర్హత బీఆర్ఎస్‌కు లేదన్నారు. తమ పార్టీ సంస్థాగత పదవుల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నామన్నారు. దీక్షలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు డికె అరుణ, మహిళా మోర్చా నేతలు కూర్చున్నారు. కార్యక్రమంలో ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపి డాక్టర్ కె లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ప్రేమేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎంపి రవీంద్రనాయక్, మహిళా మోర్చా జాతీయ కార్యవర్గసభ్యులు ఆకుల విజయ, డాక్టర్ పద్మ, మాజీ మేయర్ కార్తీకరెడ్డి, సులోచన, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

దాచుకున్న డబ్బులేవి..!

- ఏళ్ల కొద్ది నిరీక్షణ
- జనరల్ ప్రావిడెంట్ ఫండ్ కోసం ప్రభుత్వ ఉద్యోగుల ఎదురుచూపు
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆరు వేల పెండింగ్ దరఖాస్తులు
- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఉద్యోగ సంఘాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొడుకు ఉన్నత చదువుల కోసం జనరల్ ప్రావిడెంట్ ఫండ్ కోసం గతేడాది దరఖాస్తు చేసుకున్నాను. ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ నాకు డబ్బులు రాకపోవడంతో కొడుకు చదువు అర్థాంతరంగా ఆగింది.

జిల్లా వైద్యశాఖలోని ఓ ఉద్యోగి ఆవేదన

బిడ్డ పెళ్లి కోసం జనరల్ ప్రావిడెంట్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నా. ప్రావిడెంట్ ఫండ్ వస్తుందన్న ఆశతో పెళ్లి కుదుర్చుకున్నాం. కానీ సకాలంలో డబ్బులు అందకపోవడంతో అప్పులు చేసి కూతురు పెళ్లి చేయాల్సి వచ్చింది.

ఓ మహిళా టీచర్ ఆవేదన

భవిష్యత్ అవసరాల కోసం రూపాయి.. రూపాయి జమ చేసి దాచుకున్న డబ్బులు తీసుకుకోవడానికి ప్రభుత్వ ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ డబ్బులు సకాలంలో అందడం లేదు. ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. పిల్లల చదువులు, శుభకార్యాలకూ డబ్బులు అందడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జనరల్ ప్రావిడెంట్ ఫండ్ కోసం సుమారు ఆరు వేల మంది దరఖాస్తు చేశారు. ఇందులో రంగారెడ్డి జిల్లాలో నాలుగు వేల మంది, వికారాబాద్‌లో రెండు వేల మంది ఉన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జనరల్ ప్రావిడెండ్ ఫండ్‌ను దరఖాస్తుదారుల ఖాతాలో జమ చేయాలని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 29 వేల మంది ఉన్నారు. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 17 వేల మంది ఉండగా వికారాబాద్ జిల్లాలో 12 వేల మంది ఉన్నట్టు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. అయితే వీరు ప్రభుత్వ ఉద్యోగులుగా అపాయింట్ అయినప్పటి నుంచి తమ వేతనంలో కొంత డబ్బు 'జనరల్ ప్రావిడెంట్ ఫండ్' కింద జమ అవుతుంది. పిల్లల ఉన్నత చదువు కోసం, వైద్య ఖర్చులు, పిల్లల పెండ్లిల కోసం ఆ డబ్బులను తీసుకుంటారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో డబ్బులు తమ ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. కానీ ప్రస్తుతం రెండు, మూడేళ్లు అయినా జనరల్ ప్రావిడెంట్ ఫండ్ దరఖాస్తుదారుల ఖాతాలోకి డబ్బులు జమ కావడం లేదు. రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఈ కుబేరు' సంస్థను రెండేండ్ల క్రితం తీసుకొచ్చింది. ఇది ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు, ఆర్‌బిఐకి మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తోంది. జిల్లా ట్రెజరీ నుంచి పాస్ అయిన బిల్లులు నేరుగా 'ఈ కూబేరు'లో జమ అవుతాయి. ఇక్కడ పాస్ అయిన బిల్లులు ఆర్‌బిఐ నుంచి నేరుగా దరఖాస్తుదారుల ఖాతాల్లో జమ అవుతాయి. కానీ ఈ కుబేరు సంస్థలో జరుగుతున్న జాప్యంతో ఏండ్లకొద్ది బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం తమ సమస్యలు గుర్తించి సకాలంలో డబ్బులు జమ అయ్యేట్టు చూడాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఆర్‌బిఐ నుంచి ఖాతాలో జమ అవుతాయి

జనరల్ ప్రావిడెంట్ ఫండ్ కోసం వచ్చిన దరఖాస్తులు జిల్లాలో సుమారు నాలుగు వేల వరకు ఉంటాయి. ఇక్కడి నుంచి ప్రభుత్వానికి పంపించాం. ఈ కుబేరు నుంచి ఆర్‌బిఐకి వెళుతుంది. ఆర్‌బిఐ నుంచి డబ్బులు నేరుగా దరఖాస్తుదారుల ఖాతాలో జమ అవుతాయి.

- వెంకట్‌రెడ్డి , రంగారెడ్డి జిల్లా డిటివొ